


## ఏప్రిల్ 2009

ఏప్రిల్ నెలలో విడుదలయిన వారపత్రికలు స్వాతి, ఆంధ్రభూమి, నవ్య మాసపత్రికలు, ఆంధ్రభూమి, స్వాతి, విపుల, రచన, దినపత్రికలు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, వార్త, సాక్షి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి ఆదివారం అనుబంధాలలో ప్రచురితమైన 93 కథలలోంచి, ఈ నెల కథాసాగర మథనంలో కౌముది పాఠకుల పరిచయానికి ఈ క్రింది కథలను ఎంచుకున్నాను.

ఈనెల మంచి కథలు కొన్ని ఉన్నాయి. కానీ చదవగానే మనసును కదిలించి, మెదడులో ఆలోచనల తుఫాను రేకెత్తించగల కథలు లేవు. అందుకే ఉన్నవాటిలోంచి కాస్త భిన్నంగా, చదివించేరీతిలో, జీవితంలోని మామూలు అంశాలనే సరికొత్త కోణంలో ప్రదర్శించాలని ప్రయత్నించిన కథలను పరిచయానికి ఎంచుకున్నాను.

***జీవితం***

ఆకునూరి మురళీ కృష్ణ రచించిన ఈ కథ ఏప్రిల్ 17 స్వాతి వార పత్రికలో ప్రచురితమయింది. ఈ కథలో రచయిత మానవ మనస్తత్వంలోని ఒక సున్నితమైన బలహీనతను చక్కగా ప్రదర్శించారు. ముగింపు దగ్గరకు వచ్చేసరికి రొటీన్ అయిపోయినా రచయిత కథను నడిపినతీరు, పాత్ర వ్యక్తిత్వం ఎక్కడా పలచబడకుండా చూపిన తీరు ప్రశంసనీయం. చంద్రశేఖర్ అనే వ్యక్తికి జాతకాల మీద నమ్మకం ఉండదు. కానీ ఓ జ్యోతిష్కుడు మరణగండం ఉందనీ, దైవ ప్రార్థన తప్ప మరేమీ అతనిని ఆ గండం నుంచి కాపాడలేదనీ చెపుతాడు. అతడి మాటలను నమ్మడు. కానీ ఆ మాటల ప్రభావం అతనిపై ఉంటుంది. పూజలు చేయడు కానీ, ఒకసారి మెడికల్ చెకప్ చేయించుకుంటాడు. "నేను మరణిస్తానేమోనని భయపడుతూ కూర్చోవడం కన్నా మరణించినా ఫరవాలేదన్న ధైర్యాన్ని సంపాదించుకోవడం ద్వారా ఆ భయాన్ని మనసుండి దూరంగా పోగొట్టుకుని ప్రశాంతగా జీవించవచ్చు అని గ్రహిస్తాడు. తన వ్యవహారాలు పద్ధతిలో పెడతాడు. ఇంట్లో వారితో హాయిగా గడుపుతాడు. పిల్లలతో పిక్నిక్ కు వెళతాడు. "జీవితం సప్త వర్ణ శోభితం. అది గ్రహించకుండా కేవలం తమని ఆకర్షించే రెండు మూడు రంగులే, రుచులే జీవితం అనుకుంటూ వెర్రిగా వాటివెంట, పరుగెడుతూ మిగిలిన వాటిలోని అందాన్ని, ఆనందాన్ని కోల్పోతున్నార'ని అర్థం చేసుకుంటాడు. అప్పుడు తెలుస్తుంది, అతడి మిత్రుడు, అతడి పేరున గ్రహశాంతులవీ చేయిస్తాడు. ఇదీ కథ. మంచి పాజిటివ్ ఆలోచనను, ఆరోగ్యమైన దృక్పధాన్ని అందిస్తుందీ కథ.

***రైలుపట్టాలు.***

'సన్నిహిత్' రచించిన ఈ కథ ఆంధ్రభూమి వారపత్రిక ఏప్రిల్ 23 నాటి సంచికలో ప్రచురితమయింది. ఈ కథ ఊహించిన రీతిలో సాగుతూ అనూహ్యమైన రీతిలో పూర్తవుతుంది. కథ చకచకా సాగుతుంది. కానీ కథ పూర్తిగా చదివిన తరువాత కథలో ఎక్కడో

లోపం ఉందనిపిస్తుంది పూర్తిగా చదివాక. కథకుడి భార్య అతడిని వదిలి వెళ్ళిపోతుంది. కెరీర్ పైనే దృష్టి పెట్టిన భర్తని విమర్శించి, కొడుకును అలాగే దగ్గర వదిలి వెళ్ళిపోతుంది. కొడుకు రాహుల్ తండ్రి దగ్గర పెరుగుతుంటాడు. అతడికి కొలీగ్ సుప్రియ దగ్గరవుతుంది. రాహుల్ కూడా సుప్రియతో చనువుగా ఉంటాడు.అతడికి సుప్రియ పట్ల అభిమానం ఏర్పడుతుంది. కానీ ఆమె తనని పెళ్ళిచేసుకోమన్నప్పుడు అతడు తిరస్కరిస్తాడు. ఇదీ కథ. కథలో రచయిత పాత్రల మనస్తత్వాలను, చక్కగా చూపాడు. కానీ 'పెళ్ళి' అనేది ఓ ఊపిరాడని బంధం' అని పెళ్ళిచేసుకోవటం కన్నా ఒంటరిగా ఉండటమే మంచిదన్న నెగిటివ్' ఆలోచననిస్తుంది కథ చివరికి. అయితే, చివరికి వారిద్దరూ పెళ్ళి చేసుకుంటే ఇది మామూలు కథ అయిఉండేది. దీని కథాసాగర మథనంలో పరిచయం కూడా చేసి ఉండేవాడిని కాదు.

*<u>ఎవడేమిటి నీకు అమ్మింది?</u>*

కాశీభట్ల శశికాంత రచించిన ఈ కథ ఏప్రిల్ 26, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమయింది. ఈ కథ చాలా చక్కగా, హాయిగా, అత్యంత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని, సున్నితమైన ఆలోచనలనూ ప్రదర్శిస్తూ నడుస్తుంది. కానీ కథను ఎలా ముగించాలో అర్థంకాక కాబోలు, రచయిత కథ చివరలో ఓ పెద్ద ఉపన్యాసాన్ని జోడించటంతో కథ దెబ్బతిన్నది. సాధారణంగా కథ ముగింపు ముందు ఊహించి కథను ఆరంభించాలంటారు. ఇందుకు భిన్నంగా కథను ఆరంభించి దాన్నే ముగింపు వరకూ వెళ్ళి పొమ్మంటే కథ ఎలా తయారవుతుందో ఈ కథ చూపిస్తుంది. ఇందులో ఓ వ్యక్తి, ఒంటరివాడు, ఓ ఇంట్లో అద్దెకు వస్తాడు. అలాగే ప్రవర్తన విచిత్రంగా ఉంటుంది. జంతువులకు నీళ్ళు అందిస్తుంటాడు. చీమలకు, పిట్టలకు గింజలు వేస్తుంటాడు. అతడి ప్రవర్తన చూసేవారికి విచిత్రంగా ఉన్నా, దాని వెనుక జీవకారుణ్యం అన్న మంచి ఉద్దేశం ఉంటుంది. ఇక్కడి వరకూ కథ బాగుంటుంది. ఆ తరువాత కథలో చర్చ పెట్టి, చర్చలో సిద్ధాంతాలు జొప్పించటంతో కథ, కథ కాకుండా పోయింది. ఇందుకు భిన్నంగా మంచి సంఘటనలు సృజించి, చక్కని ముగింపు పైన దృష్టి పెట్టి ఉంటే అద్భుతమైన కథ అయి ఉండేది.

*<u>కొత్త బంగారులోకం</u>*

జి. అరుణ రచించిన ఈ కథ ఆంధ్రభూమి మాస పత్రికలో ప్రచురితమయింది. ఈ కథ ఒక రకంగా చూస్తే మామూలు కథ. కానీ సాంప్రదాయక పద్ధతులలోని ఔన్నత్యాన్ని, వాటిని పాటిస్తూ బలహీనతలను అధిగమించటాన్ని చక్కటి పాజిటివ్ దృక్పథంతో ప్రదర్శిస్తుంది కథ. కథ 'సినిమాటిక్' గా ఉన్నా, రచయిత్రి కథలో ప్రదర్శించిన దృక్పథం కథ విలువ పెంచుతుంది. 'సుధ'కు నత్తి ఉంటుంది. అందరూ ఏడిపిస్తుంటారు. అవమానిస్తుంటారు. పాప మానసిక వ్యధను గ్రహించిన తాతయ్య సుధను 'పినాకపాణి' దగ్గరకు తీసుకువెళతాడు. 'బాధల్ని రుచి చూపించే భగవంతుడు మధురమైన ఫలాలను కూడా మనకోసం సిద్ధంగా ఉంచుతాడు. ప్రతి సమస్యకూ పరిష్కారం తప్పకుండా ఉంటుంది. ఉన్న స్థితి నుండి ఉన్నతమైన స్థాయికి ఎదగాలన్న పట్టుదల, శ్రమపడే ఓపిక, నిరంతరం సాధన ఉంటే నువ్వు త్వరలోనే ఈ బాధ నుండి బయట పడగలవు' అని ఆత్మ విశ్వాసాన్నిచ్చి 'మూక పంచశతి' లోని శ్లోకాలను వల్లివేయిస్తాడు. ఆశ్చర్యకరము, పాదారవింద శతకము, స్తుతి శతకము, కటాక్ష శతకము, మందస్మిత శతకాలను బోధిస్తాడు. క్రమంగా సుధ తన వైకల్యాన్ని కోల్పోతుంది. గొప్ప వక్త అవుతుంది.

అనౌన్సర్‌గా మంచి పేరు సంపాదిస్తుంది. ఇదీ కథ. చక్కటి ఆలోచనను అతి చక్కగా ప్రదర్శిస్తుంది కథ.

*<u>అర్థరాత్రి ఆడది....</u>*

ఈ 'నెల కథ'ను ఎంచుకోవటానికి ఈ నెల చాలా కష్టపడాల్సివచ్చింది. ఎందుకంటే, కథలలో ఆలోచన బావున్నా, ముగింపులోని అసంతృప్తి కథల విలువను తగ్గిస్తోంది. అందుకని ఉన్న కథలలోంచే మిగతా వాటికన్నా 'మెరుగు' అనిపించిన కథ, బాలాదేవి రచించిన 'అర్ధరాత్రి ఆడది'ని ఈ మాసం కథగా ఎంచుకున్నాను. నిజానికి ఈ ఎంపిక కూడా అసంతృప్తికరమే అయినా, ఒక ఆలోచనను ప్రతిభావంతంగా ప్రదర్శించిన రచయిత్రికి ప్రోత్సాహమివ్వటంలో పొరపాటు లేదన్న ఉద్దేశ్యంతో, ఆంధ్రభూమి మాస పత్రికలో ప్రచురితమైన ఈ కథను ఈ నెల కథగా ఎంచుకున్నాను. ఈ కథలో రచయిత్రి చేదు నిజాన్ని ఉన్నదున్నట్టు ప్రదర్శించారు. మనం ఎంతో నాగరీకులమయ్యామనుకుంటూ, అభివృద్ధి సాధించేశాం సామాజికంగా అనుకుంటూ భావించుకుంటున్నాం కానీ మౌలికంగా అప్పటికీ ఇప్పటికీ ఏమీ తేడాలేదన్న చేదు నిజాన్ని కొట్టొచ్చినట్టు ప్రదర్శిస్తుంది రచయిత్రి. అయితే సమస్యను చూపించి, ప్రశ్నతో కథ వదిలేయటం ఈ కథలో లోపం. ప్రతివారు ప్రశ్నిస్తారు. కానీ ఆ ప్రశ్నలకు సమాధానాలివ్వటం, సమస్యలను పరిష్కారాలివ్వటం సృజనాత్మక రచయితల బాధ్యత. అయితే ఈ కథ చదివిన తరువాత ఈ ప్రశ్నకు బదులుందా? ఈ సమస్యకు పరిష్కారం ఉందా? అన్న ఆలోచన కలుగుతుంది. ఆ ఆలోచన కలగచేయటంలో రచయిత్రి కృతకృత్యులయ్యారు. వయసులో సంబంధం లేకుండా మహిళ లైంగిక వేధింపులకు గురవటం మనం అందరం చూస్తున్నదే అనుభవిస్తున్నదే

1960 లో ఒంటరిగా రైల్లో ప్రయాణిస్తున్న భవాని వెంట ఓ మగాడు పడతాడు. 1980 లో పిల్లలతో వెళుతున్న భవానికి చేదు అనుభవం ఎదురవుతుంది. 2000లో 50 ఏళ్ళ వయసులో ఓ యువకుడు రైల్లో ఆమెతో అనుచితంగా ప్రవర్తిస్తాడు. 'ఏదిమారినా ఈ గాంధీ పుట్టిన దేశంలో ఏ అర్ధరాత్రి అయినా, పగలైనా, కదిలే కార్లలో గానీ, ట్రైన్లలో గానీ, రోడ్ల మీద గానీ మరెక్కడా వయస్సుతో నిమిత్తం లేకుండా 'ఆడది' అన్న ముద్రకి మాత్రం మార్పురాదు. చీర చెంగు తగిలితే చాలనుకునే ప్రబుద్ధులు ఇప్పటికీ ఉన్నారు. ఆ చీరల్లో ఎవరో తెలియకపోయినా సరే 'ఆడది' కూడా ఒక ప్రాణమున్న మనిషే, మరబొమ్మ కాదని గ్రహించే రోజు ఎపుడొస్తుందో మరి? వస్తుందా అసలు? రచయిత్రి ఆవేదనను మనం అర్థం చేసుకోగలుగుతాం. ఎందుకంటే ఇది మన అందరి ఆవేదన. మన అందరి ఆక్రోశం. మన అందరి ఆలోచన.

*ఈనెల కథ*

## అర్ధరాత్రి ఆడది - బాలాదేవి

ఆంధ్రభూమి మాసపత్రిక మార్చి, 2009 సంచిక నుంచి

*అది 1960 వ సంవత్సరం. చూడ్డానికి పెద్ద పెద్ద కాటుక కళ్ళతో, నల్లని బారెడు జడతో, జడలో మల్లెపూల సువాసనలతో తెల్లగా మెరుస్తూ పరికిణీ, ఓణీ జాకెట్‌లో ఉన్న అచ్చ తెలుగు అమ్మాయి ఆ పిల్ల. ఆమె పేరు భవాని. ఇద్దరు తమ్ముళ్ళు, రమణ, రవిలతో స్టేషన్‌లో ఫ్లాట్‌ఫారం మీద కూర్చుందామె రైలు కోసం ఎదురు చూస్తూ. రైలు రావడానికి ఇంకా సమయం ఉంది. కానీ ఎప్పుడు వస్తుందో? జనం అంతగా లేరు. చిన్న స్టేషనది. పశ్చిమ ఒరిస్సాలో ఉన్నవాటిలో శంబర్‌పర్ పెద్ద ఊరే. ట్రంకు పెట్టెమీద భవాని, ఆమెకి రెండు పక్కలా కామిక్ పుస్తకాలేవో పట్టుకుని రమణ, రవి చదువుకుంటున్నారు.*

భవాని తండ్రి నారాయణమూర్తి అంతకుముందే కొన్ని క్షణాలముందు పిల్లలని స్టేషన్‌లో అన్ని జాగ్రత్తలూ చెప్పి మరీ దింపి వెళ్ళాడు. తను బిడివోగా పని చేస్తున్న ఊరికి మరో గంటయినా పడుతుంది వెనక్కి వెళ్ళడానికి. అందుకని రైలు రాకముందే జీపులో

వెళ్ళిపోయాడతను. ఆ రోజు ఆఫీసు పని ముగించి డాక్ బంగళా నుంచి పిల్లల్ని భోజనాలు పెట్టించి తీసుకు వచ్చాడు స్టేషన్‌కి. ఆడపిల్లలయినా, మగపిల్లలయినా చదువుకుని తమంత తాము స్వతంత్రంగా జీవించగలగాలని, ఎక్కడికయినా ఒక్కళ్ళూ వెళ్ళగలగాలని, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని, తమ నిర్ణయాలు తామే తీసుకోవాలని ఆశించి పిల్లలని అలాగే పెంచాలనుకునే ఆదర్శ వ్యక్తి అతను. అత్తగారు, మామగారు, తన తల్లి పిల్లల్ని వదిలి ఉండలేక భార్య రుక్మిణి, తన స్నేహితులు ఎందరో బంధువులు, అంత దూరంలో పెట్టి చదివించడం ఏమిటని అన్నా వినకుండా తనున పల్లెటూరులో చదువులు సరిగ్గా సాగవని, అందులోనూ తనకి ప్రతి రెండేళ్ళకి బదిలీలు అయిపోతూ ఉండడంతో పిల్లల్ని తన అన్నగారి దగ్గర సామర్లకోటలో పెట్టాడు చదువులకని. వేసవి సెలవులు అయిపోయి స్కూళ్ళు తెరుస్తున్నారు. కలెక్టర్ ఇన్‌స్పెక్షన్లు వల్ల సెలవు దొరక్క పిల్లల్ని ఒక్కళ్ళనీ పంపక తప్పలేదు అతనికి.

వాళ్ళకి ఎదురుగా కొంతమంది ప్రయాణికులు మాత్రమే ఉన్నారు. అందులో ఒకతను నల్లగా, లావుగా, పొట్టిగా, కొంచెం బట్టతలతో తమనే ఉండి ఉండి చూడడం భవాని గమనించకపోలేదు. ఆమె మనసులో కొంచెం బెదురు, భయం కలిగింది. హఠాత్తుగా కొద్దిసేపట్లో అతను క్రిందనున్న ఎయిర్ బ్యాగ్ భుజాన వేసుకుని నడవడం మొదలుపెట్టాడు. ఎక్కడికో వెళ్ళిపోతాడనుకున్న భవానికి ఊహకి విరుద్ధంగా అతను వాళ్ళవేపు రావడం మొదలు పెట్టాడు. భవాని మరో వైపు తిరిగి దూరంగా మరెవరో కుటుంబం వైపు చూస్తూ కూర్చుంది ఏమీ ఎరగనట్లుగా.

అతను దగ్గరగా వచ్చినట్లు అనిపించి ప్రక్కకు తిరిగింది భవాని. దగ్గరగా వచ్చి కూర్చున్నాడు.

"నా పేరు విశ్వనాథం. మీరు తెలుగువాళ్ళా?"

విశ్వనాథం తెలుగు మాట్లాడగానే భవానికి భయం తగ్గింది. కానీ ఆమె జవాబు చెప్పకముందే మరి కొంచెం దగ్గరగా వచ్చి బేగు కింద పెట్టి అన్నాడు మళ్ళీ "మిమ్మల్ని చూస్తే అలా అనిపించింది. ఇటు పక్క పరికిణీ ఓణీల అమ్మాయిలు కనిపించరుకదా. ఈ అబ్బాయిలు మీ తమ్ముళ్ళా?"

"అవును" అంది ముక్తసరిగా. మగపిల్లలిద్దరూ అతన్నోసారి చూసి మళ్ళీ తమ పుస్తకాలలో మునిగిపోయారు. భవాని ఆ వ్యక్తితో మాట్లాడడానికి అంత ఉత్సుకత చూపించలేదు.

అయినా అతను సంభాషణకి ఉపక్రమించాడు. "ఏ ఊరు మీది? ఎక్కడికి వెళుతున్నారు?" ఆమె నుంచి జవాబు రాకముందే అటుపక్కగా వెళుతున్న చాయ్ కుర్రవాడికి నాలుగు టీలు చెప్పాడు.

భవానీ కంగారుగా అంది "మేమెవరం టీలు తాగము. ఇంకా స్కూలులో చదువుకుంటున్నాము" కొంచెం అమాయకత్వం, బెదురు ఉన్నాయి ఆమె కంఠంలో. విశ్వనాథం తన మటుకే టీ తీసుకుని అన్నాడు "మీరొక్కరే వెళుతున్నారా?" దానికి భవాని జవాబు చెప్పకపోవడంతో అతనే అన్నాడు మళ్ళీ "అదేమిటి మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయని భయపడుతున్నారా! ఫర్వాలేదు. నేను రాజమండ్రి వెళుతున్నాను. వ్యాపారం పనిమీద వచ్చానిక్కడికి. మీకేదైనా సాయం కావాలంటే చెప్పండి."

అంతలో రైలు వస్తున్న సందడి రావడంతో మరి జవాబు చెప్పనక్కర్లేదని భవాని మనసులోనే దేవుడికి దండం పెట్టుకుంది. రైలు ఫ్లాట్‌ఫారం మీదకి చేరగానే జనం కంగారుగా పరుగులెత్తడం మొదలుపెట్టారు. ఈ రోజుల్లోలాగా ఆ రోజుల్లో రిజర్వేషన్ కంపార్ట్‌మెంటులు ఎక్కువ లేవు. నాన్న చెప్పిన జాగ్రత్తలు గుర్తుంచుకుని కంగారు పడకుండా తన ట్రంకు పెట్టె ఒక చేత్తో పట్టుకుని, రమణా, రవి తన వెనకాల పరుగుపెడుతుంటే ఎదురుగుండా కనిపించిన జనరల్ కంపార్ట్‌మెంట్‌లో జనాల మధ్య తోసుకుంటూ తొొయ్యబడుతూ అతి కష్టమ్మీద ఎక్కింది భవాని. లోపలకు వెళ్ళడానికి దారి దొరక్క, కొంచెం పక్కకు తప్పుకుని బాత్రూం దగ్గర ట్రంకు పెట్టె కష్టం మీద ఇరికించి దాని మీద తను కూర్చుని తమ్ముళ్ళిద్దరినీ చెరో పక్క కూర్చోబెట్టుకుని నెమ్మది మీద ఎలాగో ఒకలాగ రైలెక్కామన్న ధీమాతో స్థిమితపడింది ఆమె.

ఆ కంపార్ట్‌మెంట్‌లోనే ఎక్కిన విశ్వనాథం నాలుగుపక్కలా చూసి గుమ్మం దగ్గర్నుంచే వాళ్ళని చూడగానే ఆ పక్కనే చేరిపోయాడు. వస్తువుల్నీ, మనుష్యుల్నీ, తప్పించుకుంటూ. భవానికి అతన్ని చూడగానే పై ప్రాణాలు పైనే పోతున్నాయనిపించింది. అతను చాలా చాకచక్యంగా మనుష్యుల్ని తోసి ఆమెకి ఎదురుగానే తన బ్యాగు పెట్టి దానిమీద కూలబడ్డాడు. ఆమెకి అతని ఊపిరి తగులుతున్నట్లుగా ఉంది. చాలా ఉక్కగా ఉంది. గాలాడటం లేదు నిండిపోయిన ఆ మనుషులవల్ల. తనకి ఊపిరి ఆడుతున్నట్లు అనిపించడటం లేదు. భవాని మనసులో కంగారుగా ఉంది ఈ మనిషెక్కడ దాపురించాడ్రా బాబూ అని. రైలు బయలుదేరింది. నిద్రకి, ఆకలికి ఆగలేక పిల్లలిద్దరూ కళ్ళు మూస్తూ తెరుస్తూ, ఆవులిస్తూ భవానీ మీదకు వాలిపోయి అవస్థలు పడుతున్నారు. అదే అదను చూసుకుని విశ్వనాథం మళ్ళీ మాట్లాడటం మొదలు పెట్టాడు.

"మీరేమిటి మూగ మల్లెమొగ్గలా కూర్చున్నారు. మీ గురించి మీకు తెలియదులా ఉంది. ఎర్రగులాబీని చూసారా ఎప్పుడయినా? మంచి వయసులో, పదహారేళ్ళ అమ్మాయిల్లాగా ఉంటుంది కదూ."

భవానీ మాట్లాడలేదు. భ్రకుటి ముడిచి తీక్షణంగా చూడడానికి ప్రయత్నించింది మేకపోతు గాంభీర్యం తెచ్చుకుని.

విశ్వనాథం దగ్గర్నుంచి విపరీతమైన వాసన వస్తోంది. వాసనకంటే కంపు అంటే మంచిదేమో. అది చవకబారు తాగుడు వాసన అని తట్టింది భవానికి. రిక్షావాళ్ళు, ట్రక్కు డ్రైవర్ల దగ్గర అదే కంపు వస్తుంది. ముక్కు బద్దలవుతున్నట్లుగా ఉంది. పిల్లల్నిద్దర్నీ పొదవి పట్టుకుని కూర్చుందామె. అతను ఆమెకి చాలా దగ్గరగా రావడానికి ప్రయత్నిస్తున్నాడు.

"ఎర్రగులాబీని చూస్తే ఏం చేయాలనిపిస్తోందో మీకు తెలుసా? మీరు నవలేదో చదువుతున్నారు. మీకు తెలిసే ఉండాలి" అన్నాడు విశ్వనాథం.

భవానికి మౌనమే శరణ్యం అనిపించింది. రైలు కుదుపులకి, ముందుకు పడినట్లుగా తూలి ఆమె మీదకు వచ్చిపడ్డాడు విశ్వనాథ. అతని ఒళ్ళు తగలగానే కంపరం, చీదర, ఎక్కడలేని అహ్యం. భవానికి అతనిమీద ఎక్కడలేని కోపం తెప్పించాయి. పిల్లలిద్దరూ కూడా ఉలిక్కిపడి లేచారు.

భవానీ మరింకేమీ ఆలోచించకుండా హఠాత్తుగా లేచి "ఒరేయ్ రవణా, రవి! పదండ్రా లోపల జాగా ఉందేమో చూద్దాం" అని వాళ్ళిద్దర్నీ బరబరా ఈడ్చుకుంటూ మనుష్యుల్ని తోసుకుంటూ ఎవరో తరుముకొస్తున్నట్టు వెళ్ళిపోయింది లోపల్లోపలకు పెట్టె అక్కడే వదిలేసి. రెండు మూడు క్యాబిన్లు దాటాక ఒక చోట ఒక పెద్దావిడ పక్కనే కొంచెం జాగా కనిపించగానే పిలలిద్దర్నీ అక్కడే కూర్చోబెట్టి తనూ అక్కడే ఇరుక్కుని కూర్చుంది. ఆ పెద్దావిడ కొంచెం జరిగి వాళ్ళకి మరికొంచెం జాగా ఇచ్చింది. అప్పటికి స్థిమితంగా అనిపించింది భవానికి. పెట్టె పోతేపోతుంది గానీ తను తప్పించుకోగలిగింది అనుకుంటూ డబ్బు, రైలు టిక్కెట్టు ఉన్న తన పర్సు పదిలంగా పట్టుంది.

జనం ఎక్కుతూ దిగుతూనే ఉన్నారు ప్రతిచోటా రైలు ఆగగానే. అది పాసింజర్లా వెళుతోంది. మద్రాసు వరకు వెళ్ళే రైలు ఆ రోజుల్లో అదొక్కటే. పిల్లలు మళ్ళీ నిద్రలోకి జారుకున్నారు. ఎప్పుడు తెల్లవారిందో తెలియలేదు. మళ్ళీ విశ్వనాథం కనిపించలేదు. భవానికి ధైర్యమొచ్చింది. భయంలేదనుకుని బాత్రూం వద్దకు వెళ్ళి చూస్తే అదృష్టవశాత్తు పెట్టె అక్కడే ఉంది. దాన్ని తీసుకొచ్చి తన దగ్గర పెట్టుకుంది. రాత్రిలోగా హాయిగా ఇంటికి చేరగలమన్న నమ్మకం కలిగింది ఆమెకు. పిల్లలకి పాలు, బిస్కెట్లు కొనిపెట్టి తను కాఫీ తాగింది. ఆ ప్రయాణంలోని ఆ అనుభవం ఒక భయంకరమైన నిజాన్ని తెలిపింది. ఎంత చదువుకుని, ముందుకు వెళ్ళాలన్నా, మగవాళ్ళతో సమానమనుకున్నా ఒక్కర్తీ ఆడది దొరికితే చాలు ఇలాంటి మేకవన్నెపులులు, తోడేళ్ళు వెంటపడుతూ వేటాడుతూనే ఉన్నాయి.

అది మొదటి అనుభవం కావడంతో ఆమె తర్వాతర్వాత జాగ్రత్తగానే మనుష్యుల్ని తెలుసుకోవడం మొదలుపెట్టింది. చదువు పూర్తయి లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరి ఒంటరి ప్రయాణాలు చాలానే చేసింది. కట్నం ఇవ్వనని, ఉద్యోగం వదలనన్న పంతమో ఆలస్యంగానైనా తనకి తగినవాడు, తనలాగే విశాలభావాలున్నవాడు అయిన కెప్టెన్ శివప్రసాద్‌ను పెళ్ళిచేసుకుంది. ఉద్యోగం చేస్తూ

తనంతట తాను బ్రతకగలిగి భర్తకి ఫీల్డు పోస్టింగ్ వచ్చినప్పుడు సర్దుకుపోగల మనస్తత్వం, నేర్పు, సమర్ధత ఉన్న భవాని తనకి తగిన అమ్మాయే అనుకున్నాడు శివప్రసాద్. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఇద్దరివీ వేరే వేరే ఉద్యోగాలు, ప్రదేశాలు కావడంవల్ల భవానికి ఆ ఒంటరి ప్రయాణాలు తప్పలేదు.

*1980 వ సంవత్సరం.*

అప్పటికి భవానికి ముప్పై ఆరు ఏళ్ళు. కానీ ఆమె అలా కనిపించదు, 25-30 ఏళ్ళ అమ్మాయిలా ఉంటుంది. మూడేళ్ళ కూతురు రజని, రెండేళ్ళ కొడుకు రామ్‌ను తీసుకుని ఎక్కడో కాశ్మీర్‌లో కొండల మధ్య ఫీల్డు పోస్టింగ్‌లో ఉన్న మేజర్ శివప్రసాద్ దగ్గరకు బయలుదేరింది ఎండాకాలం సెలవులకి. తనున్న ఊరి దగ్గరే ఒక పల్లెటూరిలో సంవత్సరపు సెలవు తన కుటుంబంతో గడిపి వెనక్కి వెళుతున్న ఓ ఆర్మీ జవానుని భవానికి సాయంగా పంపించాడు శివప్రసాదు చంటిపిల్లలతో అన్ని రోజులు ప్రయాణం చేసి ఒక్కర్తీ సాయం లేకుండా రావడం కష్టమని, ఆ జవాను నిరంజన్‌కి ఇరవై ఏళ్ళుంటాయేమో. నెమ్మదిగా, సౌమ్యంగా 'మేమ్ సాబ్' అంటూ వినయంగా చెప్పినవన్నీ చేస్తున్నాడు.

ముందొక బస్సులో ప్రయాణం చేసి కొండల్ని దాటి విజయనగరం స్టేషన్‌లో కలకత్తా రైలుని పట్టుకోవాలి భవాని. ఒక కాశ్మీర్ బాస్కెట్‌లో పిల్లలకి పాలడబ్బాలు, సీసాలు, ఫ్లాస్కులు తిండి సామాన్లు ఒక సూట్ కేస్, ఎయిర్ బ్యాగ్‌తో బయలుదేరిందామె. సామాన్లు బస్సులో, రైలులో ఎత్తిపెట్టడంలో సాయంచేసాడు నిరంజన్. కానీ పిల్లలని మాత్రం అతని అప్పచెప్పలేదు, ఎత్తుకోనీయలేదు, ఆర్మీలో కొందరు జవాన్లు పిల్లలని మచ్చిక చేసుకుని వాడుకుంటున్నారని వింది ఆమె. ఆ కథలన్నీ విన్నాక ఆమెకి పిల్లల్ని అస్సలు వదలాలనిపించలేదు. కొందరు ఆర్మీ ఆఫీసర్ల భార్యలు తమ పిల్లల్ని జవాన్లమీద వదిలి పార్టీలకు వెళ్ళినా తను మాత్రం వెళ్ళేదిలేదు ఎంతో అవసరమైతే తప్ప. అసలు ఎవరూ సాయం వద్దందిగానీ భర్త మాటల కాదనలేక ఒప్పుకుందామె. తమని ఫస్ట్ క్లాసులో ఎక్కించి తను థర్డ్‌క్లాసు నుంచి మధ్య మధ్య వచ్చి మంచినీళ్ళు తెచ్చిపెట్టడం, పాలు, టీలు తేవడం వగైరా సాయాలు చేశాడు నిరంజన్.

కలకత్తాలో శివప్రసాద్ స్నేహితుడు మేజర్ భట్టాచార్య స్టేషన్‌కి వచ్చి భవానిని, పిల్లల్ని తన క్వార్టర్స్‌లోకి తీసుకుని వెళ్ళాడు నిరంజన్‌ని ఆర్మీ యూనిట్‌కి పంపించి.

మర్నాడే ప్రయాణం. భట్టాచార్య భార్య అరుంధతి, భవానీ పిల్లల్ని చాలా బాగా చూసుకుంది. వాళ్ళబ్బాయి అభిజిత్‌తో పిల్లలు ఆడుకున్నారు. మర్నాడు రిజర్వేషన్ ఉంది కనుక బాధలేదు అనుకున్న భవానికి అనుకోని ఎదురుదెబ్బలా హఠాత్తుగా ఆ రోజు కలకత్తా బంద్ అని రైళ్ళన్నీ ఆపేసారు. కలకత్తాలో గొడవలు.... రిజర్వేషన్లు అంత త్వరగా దొరకవు. ఒకరోజు పోయినా తన భర్తతో గడిపే సమయం తగ్గిపోతుందని భవాని భయం. ఎంత ప్రయత్నించినా రిజర్వేషన్ దొరక్క మేజర్ భట్టాచార్య మర్నాడు అదే ట్రైన్‌లో కష్టం మీద కిటికీలోంచి సామాన్లు, పిల్లలనీ అందించి జమ్ముకి వెళ్ళడానికి భవానిని ఎక్కించాల్సి వచ్చింది.

మనుషులు నిలబడేందుకు కూడా సందులేదు. అది మళ్ళీ జనరల్ కంపార్ట్‌మెంట్ కూడాను. నిరంజన్ కూడా అందులోనే ఎక్కాడు. పిల్లలకీ తనకీ సరిపడా జాగా దొరికింది. మర్నాటికిగానీ వాళ్ళు చేరరు. ఉక్కలో వేడిలో ఆ రష్‌లో అలాగే రోజంతా గడపాల్సి వచ్చింది. అర్ధరాత్రి అయింది పిల్లలతోపాటు భవానికి కళ్ళు మూతలు పడుతున్నాయి. రామ్ ఒళ్ళో, రజని ప్రక్కన తనకి ఆనుకుని నిద్రపోతున్నారు. హఠాత్తుగా తన ప్రక్కనే ఎవరో నుంచున్నట్లు అనిపించింది తనకి తగలడానికి ప్రయత్నిస్తూ. తన తొడ మీద పక్కనుంచి రామ్ తలక్రిందుగా చేయి పడగానే భవానికి మెలుకువ వచ్చింది. ఏదో షాక్ తగిలినట్లుగా అనిపించి ప్రకకి తిరిగి చూడగానే నిరంజన్ కనిపించాడు.

తన ప్రక్కనెవరో ఆవిడ ఏదో స్టేషన్‌లో దిగిపోయినట్లుంది. మెరుపులా నిల్చుందామె రామ్‌ని ఎత్తుకుం మరో చేత్తో రజనీని పట్టుకుని "యూ బ్లడీ గెటౌట్" అని అరిచింది గట్టిగా, కోపంగా. నిరంజన్ బిత్తరపోయి పిల్లిలా ముడుచుకునిపోయి లేచి నిల్చుని ఆమె

కళ్ళల్లో రక్తపు జీరలు చూసి చల్లగా జారుకున్నాడు బయటకి. జనంలో సంచలనం వచ్చి చూసేసరికి భవని తన జాగాలో పిల్లల్తో కూర్చుండిపోయింది.

✷✷✷

మర్నాడు జమ్ము చేరి దిగిన వేళకి నిరంజన్ కనబడలేదు. శివప్రసాద్‌ని చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లు అనిపించింది భవానికి. కన్నీళ్ళు రాబోతుంటే ఆపుకుని చేయి ఊపిందామె.

"నిరంజన్ ఏడి?" అంటూ వచ్చాడు శివప్రసాద్.

"వాడక్కర్లేదు. సామాన్లు కూలి వాడి చేత దింపించండి" అంది భవాని.

అతనొక నిముషం ఆమె కళ్ళల్లోకి చూసి ఏదో అర్థమయినట్లుగా లోపలకు వెళ్ళి సామాన్లు ఒక్కడే అన్నీ బయటకు తెచ్చేసాడు.

పక్క కంపార్ట్‌మెంట్ నుంచి నిరంజన్ పరుగెత్తుకుంటూ వచ్చి శివప్రసాద్‌కి శాల్యూట్ చేసాడు.

"ఆప్‌కా జరూరత్ నహీ..." అన్నాడూ మేజర్ శివప్రసాద్ కొంచెం కరుకుగా.

వాళ్ళు కార్లో ఆర్మీ ట్రాన్సిట్ కేంప్‌కి వచ్చాక జరిగింది చెప్పి అంది భవాని సజల నయనాలతో "మరెవర్నీ ఎప్పుడూ ఇంక పంపవద్దు. పిల్లలతో ప్రయాణాలు చేసి రావడం నాకలవాటే. వాళ్ళింక పెద్దవాళ్ళయిపోతున్నారు నేను ఒక్కర్తినీ రాగలను"

"డోంట్ వర్రీ.... నిరంజన్‌ని నేను చూస్తానులే" అన్నాడతను. కానీ అతనికి తెలుసు ఆ జవాన్లు కొండల్లో, మంచులో, ఎడార్లలో, ఇసుకలో, వేడిలో నెలల తరబడి పెళ్ళాం పిల్లల్ని వదిలి ఎలా బ్రతకుతారో? అతను నిరంజన్ ప్రవర్తనకి కారణాలు చెప్పదలచుకోలేదు. భవానికి అవేమీ అక్కర్లేదు. జవాను మగబుద్ధిమీదే కోపం ఉందామెకి.

ఆ రెండో అనుభవం తరువాత కూడా ఆమె ఎన్నో సార్లు పిల్లలతో ఒక్కతే ప్రయాణాలు చేసింది. కానీ మనసులో ఆమెకి ఉండిపోయింది భావన. అలాగే ఈ తోడేళ్ళ బారినుంచి ఆడదానికి విముక్తిలేదు ఎప్పటికీ అని.

## 2000 మిల్లినియం సంవత్సరం

భవానికి ఇప్పుడు ఏభై ఆరేళ్ళు. కాలేజీ ప్రిన్సిపాల్‌గా మరో రెండేళ్ళలో రిటైరవుతుంది. బ్రిగేడియర్ శివప్రసాద్ భవానితోపాటే భువనేశ్వర్‌లో బ్యాంక్‌లో ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా ఉన్నాడు. రజనికి పురిటి నొప్పులు దగ్గర పడ్డాయని ఆ రోజు ఢిల్లీకి బయలుదేరింది. తనకి సెలవు దొరకలేదని, తరువాత వస్తానని ఆమెని రైలెక్కించి వెళ్ళిపోయాడు శివప్రసాద్.

ట్రైన్ ఎక్కగానే తను చిన్నప్పుడు ఎక్కిన రైళ్ళకి ఇప్పటికి ఎంతో తేడా అని మనసులో పాత జ్ఞాపకాలన్నీ గుర్తుకువచ్చాయి. వాటితో పాటు ఈ నాగరికత.. అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా? ఇప్పటి ఈ మొబైల్ ఫోన్లు, లాప్ టాప్‌లు, ఎల్ సిడి టీవీలు, డిజిటల్ కెమేరాలు, హోమ్ థియేటర్లు, కార్లు, ట్రైన్లు, విమానాలు.... ఓహ్ ఒకటే ప్రపంచం. గ్లోబలైజేషన్. మనిషి మారాడా మరి? అమ్మా నాన్నా లేరు. తనకి శివప్రసాద్‌కి దగ్గరైన తన్న తమ్ముళ్ళు, కుటుంబాలు, అక్క చెల్లెళ్ళు. ఎక్కడెక్కడో ఉన్నారీ ప్రపంచంలో తన జీవితంలో ఇంత మార్పు వస్తుందని నలభై ఏళ్ళ క్రిందట తను అనుకుందా? కానీ ఆమెకి తెలిసిందల్లా అప్పటికీ ఇప్పటికీ మార్పులేని ఆ తోడేళ్ళ గురించే ఆమెకి మనసులో అనిపించింది ఇప్పుడూ అటువంటి అనుభవం - తనలో తనే నవ్వుకుందామె. తనకిప్పుడు వయస్సు లేదు. యాభై ఆరేళ్ళ వృద్ధ వనిత తను కానీ ఆమెకి తట్టనిదల్లా తను అంత వయసున్నదానిలా కనబడదని! ఆమె అందం తరగలేదు. నల్లరంగు కొట్టిన బాబ్డ్ హెయిర్, నల్లని చీరతో తెల్లగా మెరుస్తున్న శరీరం, ఆ బంగారు వన్నెకి మెరుపు తెచ్చేట్లుగా మెడలో ముత్యాల హారం, చేతులకి ముత్యాల గాజులు, ఖరీదైన వాచీ. ఆమెని చూస్తే ఇంకా నలభై ఏళ్ళు కూడా రాలేదనుకుంటారు ఎవరైనా. చూడముచ్చటగా ఉందామె. ఫస్ట్‌క్లాస్ ఏసి కంపార్ట్‌మెంట్‌లో క్రిందసీటులో హాయిగా వెనక్కి జారబడి ఇంగ్లీషు నవలేదో చదవడం మొదలుపెట్టింది. ఎదుటి సీట్లో

వయస్సులో ఉన్న కొత్త దంపతులు తన ప్రక్కన చిన్న కుర్రవాడొకడు ఇరవై అయిదేళ్ళదాకా ఉంటాయేమో. ఎవర్తోనో అటు ప్రక్కవాళ్ళతో మాట్లాడుతూ తన గురించి చెప్పుకుంటే వింది. అతనొక ఐఎఎస్ ఆఫీసర్ అని. తన అల్లుడు వయసన్నమాట.

నీళ్ళ బాటిల్, లంచ్ టీ, డిన్నర్ అన్నీ సమయానికి అందిపోయాయి. ఎవరి సీట్లలో వాళ్ళు సర్దుకుని పడుకోవడం మొదలు పెట్టారు. చాలా సేపు చదువుకుని ఏ రాత్రి పన్నెండు దాటాకో లైటార్పి పడుకుంది భవాని.

హఠాత్తుగా కాళ్ళ దగ్గర ఎవరో కూర్చున్నట్లుగా అనిపించింది. తన పాదాలు తడిమిన ఆ చేతులు మరికొంచెం కాళ్ళపైకి రాబోతుంటే గబుక్కున లేచి తన సీటు పక్క లైటు వేసిందామె. ఆమె పక్కనే దగ్గరగా కూర్చున్నాడు.

అతన్ని కోపంగా చూసి అందామె ఇంగ్లీషులో "నిద్ర రావడంలేదా? బైదిబై నేను చెప్పడం మరిచిపోయాను. నువ్వు ఐఎఎస్ కదూ. మాఅల్లుడు నిశ్చల్ కూడా ఢిల్లీ సెంట్రల్ గవర్నమెంట్‌లో ఐ ఎ ఎస్ ఆఫీసర్, కూతురు మార్కెటింగ్ మేనేజర్, మా అబ్బాయి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నేను కాలేజీ ప్రిన్సిపాల్‌గా వచ్చే సంవత్సరం రిటైరవుతాను. మా అమ్మాయి డెలవరీకి ఢిల్లీ వెలుతున్నాను. బహుశా మీ అమ్మ నా అంతే ఉంటుందేమో కదూ, పోయి నిద్రపో" ఒక్కసారిగా దెబ్బతిన్నట్లు ఆ కుర్రవాడు మరి మాట్లాడలేక "సారీ" అని పై బెర్తు మీదకి వెళ్ళిపోయాడు. ఆమె గొడవ చేయకుండా తనని మందలించి వదిలేసినందుకు మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

డెబ్బై ఏళ్ళ వృద్ధ స్త్రీ నుంచి ఉయ్యాలలోని పసికందు వరకు ఆడవాళ్ళని వదలని ఈ మనుష్యులు మనుష్యులేనా? తోడేళ్ళా? ఆమెకి ఎన్నో ఏళ్ళ క్రితం జరిగిన ఇంకో సంఘటన కూడా గుర్తుకు వచ్చింది. ఒక లేడీ ఐ ఎ ఎస్ ఆఫీసర్ పోలీస్ డిజి గురించి. ఏదో తమాషాకి చెయ్యి తగిలించానని తప్పించుకోబోయాడా ప్రబుద్ధుడు. ఇటువంటి విషయాలు వదిలేస్తే చిన్న చీమలు పుట్టలు పాముల గుట్టలైనట్లు పెరిగిపోతాయని ఆ లేడీ ఆఫీసరు చివరిదాకా వదలలేదు ఆ పోలీసు వ్యక్తిని. చదువుకున్న వాళ్ళ అవస్థ ఇలా ఉంటే నిరక్షరాస్యుల సంగతేమిటి?

అప్పుడు భవానికి మళ్ళీ మరోసారి అర్థమయిందల్లా ఏది మారినా ఈ గాంధీ పుట్టిన దేశంలో ఏ అర్ధరాత్రి అయినా, పగలైనా, కదిలే కార్లలో గానీ, ట్రైన్లలో గానీ, రోడ్డుమీదగానీ మరెక్కడైనా వయస్సుతో నిమిత్తం లేకుండా 'ఆడది' అన్న ముద్రకి మాత్రం మార్పురాదు. చీర చెంగు తగిలితే చాలనుకునే ప్రబుద్ధులు ఇప్పటికీ ఉన్నారు. ఆ చీరలో ఎవరో తెలియకపోయినా సరే 'ఆడది' కూడా ఒక ప్రాణమున్న మనిషే, మరబొమ్మ కాదని గ్రహించే రోజు ఎప్పుడొస్తుందో మరి? వస్తుందా అసలు?

✷✷✷